

# దరిద్రగొట్టుకధ

దాట్ల నారాయణమూర్తిరాజు

బస్టాండు పరమ దరిద్రంగా వుంది. దిక్కుమాలిన దేశంలో దిక్కుమాలిన ప్రజలకు కాస్త నీడనిచ్చే దిక్కుగానే వుంది. అక్కడ ఆ బస్టాండుకు ఇవతలపక్క పెద్ద మైదానం వుంది. గవర్నమెంటువారు ఆ మైదానంలో బ్రహ్మాండమైన స్టేడియంని కడదామని పది సంవత్సరాల క్రితం శంఖుస్థాపన చేసారు. అదింకో పదిహేను సంవత్సరాలకి స్టేడియంగా తయారవొచ్చు. అవకపోవచ్చు. ఈ లోపున ప్రజలకు ఉపయోగపడుతుందనే సదుద్దేశంతో ఖాళీగా వుంచేరు ఆ ఖాళీ మైదానాన్ని ప్రజలు. ఎడంపక్కన పురుషులు, కుడిపక్కన స్త్రీలు బహిరంగ పాయిఖానాగా ఉపయోగిస్తున్నారు.

ఆ మైదానానికి కొంచెం దూరంలో ఏభై గుడిసెలున్నాయి. ఆ గుడిసెలు బురదలో సందుల్లా అస్తవ్యస్తంగా వున్నాయి. ఆ పక్కనే కార్పొరేషన్ వాళ్ళు వూరిలోని చెత్తనంతా అక్కడే కుప్పగా పోస్తారు. మురికి, మురిగ్గావున్న ఆ ప్రదేశంలో అక్కడి గాలి కూడా మురిగ్గానే వుంది. అటువంటి చోట....

* * *

విజయనగరం వెళ్ళే బస్సెక్కి కూర్చున్నాను.

క్రింద కొట్లాట. టిక్కెట్టుకోసం కొట్లాట. బస్సెక్కడానికి కొట్లాట.

అరగంటలో బస్సంతా జనాల్తో నిండిపోయింది. తిండికి వాచిపోయినట్టుగా కొంత మంది అదేపనిగా తింటున్నారు జంగిడే జంతికలు. వెనక సీట్లోంచి పరపరమని విప్పేస్తున్నాయి.

"బాబూ ధర్మం" తలతిప్పి చూసాను.

"బస్సేక్సిడెంటులో కాలుపోయింది బాబూ ఆడపిల్లలుగల సంసారం" అతనివేపు చూసాను. కుడికాలు మొండిగా వుంది. జేబులో చెయ్యి పెడితే పదిపైసల బిళ్ళ దొరికింది. అదే అతనికిచ్చాను 'సలామ్'చేసి ముందు కెళ్ళిపోయాడు.

ఆర్టీసీ బస్సులొచ్చినా ప్రైవేట్ బస్సులు ఒదల్లేదు. అవసరానికి ఈ ఆర్టీసీ బస్సులురావు. తప్పని పరిస్థితుల్లో ప్రైవేట్ బస్సు ఎక్కక తప్పదు. అలాగే అయింది నా పరిస్థితి.

బస్టాండు పెద్ద సంతలావుంది. ఎవరిగోల వాళ్ళది. బస్సులు ఎక్కేవాళ్ళు దిగేవాళ్ళు కాకా హోటళ్ళల్లోంచి పెద్ద గొంతుతో వినబడే పాటలు....పాటలు....

బస్సే బజారులా వుంది.

"మామూలుగా మీరు బజారులో కొంటే ఎనభై రూపాయలు....పాడండి బాబూవేలం...వేలం...." ఒక వ్యక్తి చేతిలో బట్టల మూటతో బస్సెక్కి ఒక ఫాంటు బట్టనివిప్పి అందరికీ చూపిస్తూ గట్టిగా అరుస్తున్నాడు.

"పది రూపాయలు" ఎవరో వెనకనుంచి పాట ప్రారంభించారు.

"ఇరవై"

"ముప్ఫయిఐదు"

"నలభై" నలభై దగ్గరకెళ్ళి పాటు ఆగిపోయింది.

"ఒకటోసారి .... రెండోసారి .... మూడోసారి" అని, ఆ వేలం వ్యాపారి "మాకు కిట్టదు బాబూ" అని పాట పాడిన వాళ్ళందరకూ బహుమతిగా మనిషికో దువ్వెన తీసిచ్చి బస్సు దిగిపోయి, ఇంకో బస్సులోకి వెళ్ళాడు.

"దయగల తల్లులు....కనికరం బాబులు.... ముసిలిదాన్ని బాబూ .... ముసిలిదాన్ని ధర్మం బాబూ....కష్టపడలేని జల్మం" బస్సులోంచి కిందకు దింపేను చూపుని.

ముసలమ్మ.

గోనెముక్కని నడుంచుట్టూ చుట్టుకుంది. చిరిగిన పాతగుడ్డని గుండెలమీద కప్పుకుంది. నెరిసి చెదరిపోయిన తల ఎండ కాంతికి బూడిద రంగులో మెరుస్తోంది. గంటల తరబడి నేలమీదపడి దొర్లి లేచినట్లగా వుంది శరీరం. ఏభై ఏళ్ళుంటాయి. ముఖం పండి, రాలిపోయి, బూడిదలోపడ్డ మద్రాకులావుంది. ఒక చేతికి రంగంతా వెలిసిపోయి, తెల్లగా ఐపోయి నొక్కుకుపోయిన రోల్డ్‌గోల్డ్ గాజు, రెండో చేతికి ఏదో సన్నటి నల్లటితాడు కట్టుకుని వుంది. కుడికాలు మొకాలునుండి కింద వరకూ ఏదో గుడ్డ గట్టిగా బిగించి కట్టివుంది. కుడికాలికి చిటికెన వేలు లేదు. వికృతంగా వుంది. ఆ ముసలమ్మ వంటిమీద చెమట సూర్యకాంతికి ముత్యాల్లాగ మెరవటంలేదు. కొండ్రించి వుమ్మిన వుమ్మి ఎలాగ వుంటుందో అలాగవుంది ఆవిడ వంటిమీద చెమట.

"ఏ జల్మంలయే పాపం సేసానో వలంగా వున్నావు కష్టపడి బతగ్గూడదూ అంటారేమో మూర్చ జబ్బుంది. వళ్ళంతా పుళ్ళు బాబూ... నాకు పనెవడిస్తాడు నాయన్లారా....అన్నవెవడు ఎడతాడు తండ్రులూ....మీరే తండ్రులు తల్లులు బాబూ దరిమం మీరు తినీసిన అరటిపండు తొక్క ఇవ్వండి బాబులూ ఆదేసాలు....నాలాటి దరిద్రపు గొట్టుదానికి....అదే పున్నెం మీ పిల్లల కాపుణ్యం కానుద్ది....అమ్మా తల్లీ మీ పసుపూ కుంకం కలకాలం నిలవాల. ఎక్కువడిగనేదు. ఒక్కపైసా పైసా పైసా ఇప్పించండి. దయసూపండిబాబూ. సినబాబూ పెత్తండ్రీ అమ్మలూ బాబూ "చేతులెత్తి, బస్సులోని వాళ్ళను ఎగిరెగిరి చూస్తూ, పక్కనవున్న వాళ్ళని ఆశగా చూస్తూ అడుగుతోంది ముసలమ్మ.

ఎవరూ పలకడంలేదు. ఎటో చూస్తున్నారు. నా వెనక ఆ సామీ నిద్రలో వున్నాడు. వాడి పక్కనున్న కాలేజీ కుర్రాడు బస్సుషెల్టరులో ఏదో బస్సుకోసం నిలబడ్డ నీలంచీర అమ్మాయిని చూస్తున్నాడు. నా ముందు నవదంపతులు

ఆ అమ్మాయిఇచ్చిన కాగితం చదివి ఆశ్చర్యపోయాను. నమ్మలేకపోయాను. ఆ అమ్మాయి పేరు గంగ. పెళ్ళయిన వెంటనే భర్త పోయేడట. వాళ్ళు నలుగురక్కచెల్లెళ్ళట. మిగతా ముగ్గురూ కళ్ళూ, కాళ్ళూ లేనివాళ్ళట. దయగల వాళ్లందరూ అదుకోవమని అందులో వ్రాసి ఉంది.

తెగ నవ్వుకుంటున్నారు. అతను ఆవిడ భుజ మ్మీంచి చెయ్యివేసి గర్వంగా చుట్టూ చూస్తు న్నాడు. కుడిపక్కన పేషన్ పేరేడ్‌కి వచ్చి నట్లుగా షోకు చేసుకొచ్చిందో కావిడ. మాటి మాటికి ఏదీ శాశ్వతం కానట్టుగా పైటనువదిలే స్తోందావిడ. ఎడంపక్కన ముందుకూర్చున్న కాలేజీ కుర్రాళ్ళు, మాటిమాటికి వెనక్కి తిరు గుతూ, చూస్తూ జోకులేసుకుంటూ ఆనందిస్తు న్నారు.

"ఒక్క తండ్రికీ దయలేదు. ఒక్క తల్లికీ కనికరంలేదు. మా తల్లులే మా తండ్రులే ఇష్ట మొచ్చినట్టుగా కరుసుపెడతారు. ఇష్టమొచ్చి నట్టుగా తింటారు. బీద్దానికి ఒక్కపైసా ఇసిరే డానికి పోయే కాలాలు. మీ పంచభక్ష్య పర మాన్నాలడిగేనా పాయసాలడిగేనా చూ త్తంచే మీరేరిగిందివ్వమన్నా ఇచ్చేట్టులేరు. అంచేత



పెపంచకం కరువుతో నిండిపోయింది. ఇలా బోళ్ళుండబట్టే ఈ రోజులొచ్చేయి. ఆకల్తో మోవేడ్చినట్టు మీరేడుస్తారు. మలమల మేం మాడినట్టు మీరు మాడతారు". బస్సులోని వాళ్ళని, ప్రపంచాన్ని మొత్తం అందర్నీ ఇష్ట మొచ్చినట్టుగా తిడుతూ, చేతులు వూపుతూ, వెక్కిరిస్తూ పిచ్చిపిచ్చిగా ప్రవర్తిస్తోంది ముసిల్ది.

"ఇంతసేపూ బాగానే వుందే. పిచ్చిగాని వుందా" ఎవరో బైటకే అన్నారు.

"ఏమండీ" అ పిలుపుకి తలతిప్పిచూసాను ఓ అమ్మాయి నిల్చునుంది. చేతిలో ఏదో కాగితం పెట్టింది. తర్వాత బస్సులో వున్న వాళ్ళందరి దగ్గరకువెళ్ళి తలో కాగితం ఇచ్చింది. ఆ అమ్మాయివేపు చూసాను. పాతికే ళ్ళుంటాయి. సన్నంగా పొడవుగా వుంది.

నల్లగావున్నా నలుపులో అందంవుంది. ముఖం కోలగా వుంది. పెద్ద కళ్ళు.పొడవైన ముక్కు చివర 'ముక్కుపుడక' ముఖానికి అందా న్నిచ్చింది. చెవులకు పెద్ద సైజు రింగు లున్నాయి. ఒంటి జడ పిరుదుల వరకూవుంది. అది సవరమో సహజమో తెలీదు. కనకాం బరం పూలతో దవనాన్ని కలిపి జడలో పెట్టు కుంది. లేత గులాబీ చీర, అదే రంగు జాకెట్టు మిగతావన్నీ ఒకటే రంగువి కావటంవల్ల ఆకర్షణీయంగా వుంది.

ఆ అమ్మాయిచ్చిన కాగితం చదివి ఆశ్చర్య పోయాను నమ్మలేకపోయాను. ఆ అమ్మాయి పేరు గంగ. పెళ్ళయిన వెంటనే భర్త పోయే డట. వాళ్ళు నలుగురక్క చెల్లెళ్ళట. మిగతా ముగ్గురూ కళ్ళూ, కాళ్ళూ లేనివాళ్ళట. దయ

గల వాళ్ళందరూ ఆదుకోమని అందులో వ్రాసి వుంది. ఎవరో పెద్దాయన వ్రాసిచ్చిన కాగితం అది. కింద ఆయన పేరు వివరాలు వున్నాయి.

ఆ అమ్మాయి ఒక్కొక్కరి దగ్గరికెళ్ళి ఇచ్చిన కాగితం తీసుకుని 'ధర్మం చెయ్యండని' అడుగుతోంది. చాలా మంది తోచింది స్తున్నారు. అందరి దగ్గరా డబ్బులువసూల్చేసు కుని బస్సు దిగుతోంది ఆ అమ్మాయి.

క్రిందనున్న ముసలమ్మ అరుస్తోంది.

"చూసారా బాబులూ టెక్కుటక్కులాడు కుని, అరువు సీర సింగారించి, హోషుగా

వచ్చి ధరమం...బిచ్చం....అనొస్తే మా బాబులే దానందం, దాని గుండెత్తులూ చూసి ఓహ్ రూపాయలిచ్చేరు. ఎయ్యండి ఎయ్యండి. ఏదో కాయితమ్ముక్క సూపించీ సరికి ఐసయి పోయారు. తల్లులు మరియాదగా ఎండనబడి గంటపించి అడుక్కుంటున్నానే. పైసాకి నేనోచుకోలేదా పావలాలిచ్చేరే...దాని పనే బాగుంది. పగలడుక్కోడం...రేత్రిబిజినెస్సు... నంజల మాటలే నమ్మద్దీ లోకం. సంసారి మాట లెక్కడిక్కావాలి"

ఒంటి కాలి మీద నిలబడి, ఓటు కాన్ స్టేబుల్ ఫోజిచ్చి కళ్ళు చిత్రంగా తిప్పుతూ, చేతులు వూపుతూ కేకలేస్తోంది ముసిల్ది.

"ఏమన్నావ్ నేనంజనా" ఇంతసేపూ సౌమ్యంగా మమ్మల్నడిగిన అమ్మాయి కిందకు దిగుతూ గొంతుపెంచి అన్నాది.

"నంజవా..మరి నంజవా.. సెతకారీ నంజవి. జగుల్పాజీ నంజవి....పడుసుకునే నంజవి.... పత్తిత్తు నంజవి....పొద్దున్నొకడితో మద్దేన వింకొకడితో, సాయంత్ర వింకొకడితో రాత్రి వొకడితో కులికే సానినంజవి. నీఏసాలు నా కెరికనేదా. నేనడుక్కుంటున్న దగ్గరికల్లా వస్తావు. నా డబ్బులట్టుకెళిపోతావు. సంవత్కారి నంజా. నా నోట్లో నోరెట్టక" నోరంతా చాపి అరిచింది ముసిల్ది.

"మాటలు సరిగ్గా రానీయ్ ముసిలీ....కీలిరిగి పోగల్దు. తన్నేనంటే హౌరా బ్రిడ్జీ కాడకెళ్ళి పోగలవు" అన్నాదా అమ్మాయి.

"అవునే నీ సోకు బుగ్గిలో కలవా....హౌరా బిడీజీలు లచ్మీ టాకీసు గుడిసెలు మెరీనా బీచు ఇసకల దొర్లడాలు, రాసవానిపాలెం క్లబ్బుల్లో తొంగోడాలు, తాటిచెట్లపాలెం తాటితోపుల్లో తిరగడాలు, రామకృష్ణ జంక్షన్ల బేరాలు. నీ బేరాలు నాకెరికేనే నంజా....నంజ ...ని నంజకి దానాలు సేస్తారు బాబులు. నంజ డబ్బు నంజకే బాగడిపోతారేటి. అమ్మాయిని తిడుతూ బస్సువేపు ఒకసారి చూసి తిట్టింది.


"తిండానికి తిండి లేకపోయినా ముండకి పోయేకాలం చూడండి అందర్నీ తిడుతోంది" బస్సులోని ముసిలాయన వ్యాఖ్యానించేడు.

ఇంతలో ఆ అమ్మాయి అక్కడేవున్న కర్రపేడుని తీసి ముసిల్దాని మీదకిసిరింది. అదెళ్ళి ముసిల్దాని వీపుకి తగిలింది. ముసిల్ది బండబూతుల్లోకి దిగింది. ఆకర్రని అందుకుని అట్నించిటు విసిరింది. ఆదెబ్బని కుర్రది తప్పించుకుంది. ఇంతలో ముసిల్ది భయంకరంగా కళ్ళెర్రచేస్తూ రెండు చేతుల్నీ చాస్తూ కుర్రదానిమీద పడింది. కుర్రదాని జుట్టుపీకింది. బొట్టు చెరిపేసింది. పాములాంటి జడను పట్టుకుని గుంజింది. పూలు చెల్లా చెదురై పోయాయి. అమ్మాయిని ఒంగోపెట్టి వీపు మీద దబదబా బాదింది. అమ్మాయితిట్లు లంకించుకుంది. అట్నించిటు తిరగబడి ముసిల్దాని జుట్టు పట్టుకుని గుంజి వెనక్కితోసింది. ముసిల్ది తాటకిలాపడి, ముక్కూచెవులూ తెగిపోయిన శూర్పణఖలా లేచింది. కుర్రదాని మెడను పట్టుకుని తోసింది. చీరను పట్టుకుని లాగింది. రెండు చేతుల్తో గట్టిగా పట్టేసి బోర్లా పడగొట్టింది. కుర్రది నేలమీద పడిపోయింది. పెదవి చిట్లిపోయి రక్తం చిమ్మింది.

ఆ అమ్మాయి ఒక్కసారి "ముసిల్లంజనీ అంతు చూస్తా" అనుకుంటూ ముందుకు దికింది. అదే సమయంలో ముసిల్దీ కలబడింది. ముసిల్దాని నడుంచుట్టూ చుట్టుకున్న గోనెగుడ్డ పర్రుపర్రుమంది. గుండెలమీది జానా బెత్తెడు గుడ్డా జారిపోయింది. ఆ ముసిల్ది వెనకనుంచి కుర్రదాని జాకెట్టు పట్టుకుని గుంజింది. అప్పటి వరకూ కుర్రదాని జాకెట్లోవున్న రూపాయి నోట్లూ, చిల్లర చప్పుడుచేస్తూ నేలమీదపడ్డాయి. ఆ జాకెట్టు చిరిగిపోయి ముసిల్దాని చేతికో ముక్క వచ్చింది. ముసిల్ది ఆ కుర్రదాని లంగా పట్టుకుని సర్రున చించేసింది.

అప్పుడక్కడ ఆ మహానగరంలో, ఆ బస్టాండులో అక్కడ వేలమంది జనంమధ్యన ఇద్దరు ఆడవాళ్ళు నగ్నంగా ఈ దేశానికి అసలైన సంస్కృతిలా నిలబడివున్నారు. ఆ సమయంలో ఆ కుర్రది గబుక్కున చేతికి దొరికిన పెద్దరాయి తీసుకుని ముసిల్దాని నెత్తిమీద బాదింది. ఒక్కసారి ముసిల్దాని నెత్తిమీంచి రక్తం వెల్లువలా పారింది. ముసిల్ది పెద్దకేకవేస్తూ నేలమీద పడిపోయింది. వెంటనే ఆ కుర్రది అక్కడక్కడ పడిపోయిన జాకెట్టు ముక్కని, లంగాని, చీరని నుమ్మలు చుట్టుకుంటూ నేలమీది డబ్బుల్ని ఏరుకుని గబగబా గబగబా... గబగబా... బస్టాండు బైటకు పారిపోయింది.

ముసిల్ది పడిపోయి లేవలేని పరిస్థితిలో కేకలు పెడుతూ ఏడుస్తోంది. ఎవరో వెళ్ళి అక్కడక్కడ పడిపోయిన గుడ్డముక్కల్ని దానివంటిమీద పడేసారు. ఎవరో తెచ్చి షోడా యిచ్చారు. షోడా తాగేక లేచి, బట్టలు సర్దుకుని "నన్ను సావసంపేవ్ నంజ..దేవున్నాదే ఆడు ఇయ్యేల్టికి మూడు పొద్దులకి నిన్ను బలి కోరకపోతే నామీదొట్టు. ఏ సిటీబస్సో గుద్దెయ్యకపోతే సూడు...ఒసే ఒసే" అని ఆ కుర్రదాన్ని తిట్టి, మళ్ళీ చుట్టపక్కల జనంవేపు ఒకసారి చూసి, బస్సువేపుచూసి దరమం



బాబూ.... అమ్మా... బాబూ.... కనికరం గల తల్లులు.... దరమ పెబువులు...."అని అనుకో వడం మొదలు పెట్టింది.

ఇంతసేపూ అక్కడ జరిగింది అందరూ చూడడంవలన, ఒక్కసారి ఆ మహాజనుల మనసుల్లో దయ వెల్లివిరిసి పాలవెల్లిలా పొంగింది. బస్సులో జనం. కిందనున్న జనం అందరూ "పాపం ముసిల్ది" అని సానుభూతితో తోచిన పైసల్ని విసిరి తమ ధర్మ బుద్ధిని ప్రదర్శించుకున్నారు

ఆ ముసిల్దాని చేతులనిండా బోలెడంత చిల్లగ, దాని ఒక్కంలో కొన్ని రూపాయి నోట్లు. ఆ ముసిల్ది ఆనందంగా నవ్వింది. నవ్వుతూనే అందర్నీ "దరమం అంటే అనాగుండాల. పిల్లాపాపలతో సల్లగుండండిబాబులూ అమ్మలూ పసుపూ కుంకంతో సల్లగుండండి" అని దీవించింది.

అప్పటికి విజయనగరం వెళ్ళే బస్సు బైల్దేరింది. చాలాసేపు వాళ్ళిద్దరిగురించే ఆలోచించాను మరచిపోలేని దృశ్యం. ఆఫీసు పని మీద విజయనగరంలో రెండు రోజులున్నాను.

* * *

విజయనగరంనుంచి వచ్చిన బస్సు దిగి బస్టాండుని ఒక్కసారి చూసాను. బస్టాండు నిశ్శబ్దంగా వుంది. అప్పుడు రాత్రి పదయి వుంటుంది. బస్సు దిగి నడుస్తున్నాను.

అక్కడక్కడ లైట్లు మిణుకు మిణుకు మంటున్నాయి. ఆ లైట్లకాంతికి కనీకనబడనట్లుగా కనబడే దారి మన అభివృద్ధి పథకాల్లాగే గతుకు గతుకులతో నిండివుంది. మలుపు తిరిగి నడుస్తున్నాను. కుడిపక్కన దేవాలయంముందు ఆంజనేయుడి విగ్రహం భూతంలా నిలబడి భయపెట్టింది.

ఎడంపక్కన వరసగా గుడిసెలు. ఆ గుడిసెలు బురదలో పందుల్లా అస్తవ్యస్తంగా వున్నాయి. అవన్నీ చీకట్లో చీకటిముద్దగా మాత్రమే కన్పిస్తున్నాయి.

ఆ గుడిసెల దాటి మలుపు తిరగబోయాను.

"ఏవండీ" ఆ పిలుపుకి వెనక్కి తిరిగి చూసేను. తెల్లటిచీర తప్ప ఏంకనిపించలేదు. ఇంతల్లో నన్ను పిలిచిన ఆ వ్యక్తి నాదగ్గర కొచ్చి "మా మామ్మకు నిన్నట్నుంచీ జ్వరమండి. నాచేతులో డబ్బుల్లేవు. ఇప్పుడు మరీ ప్రమాదంగా వుందండి. ఏవండీ" రెండు చేతులు ఎత్తి నాకు నమస్కారం పెట్టి అడుగుతోంది.

ఏవనాలో తోచలేదు. ఇవ్వాలా? వద్దా? ఇలాటివి మామూలే. రోజూ చూస్తున్నవే. ముందుకు నడవబోయాను.

"మిమ్మల్నే ప్లీజ్" ఆ ఇంగ్లీషు మాటకి వెనక్కి తిరిగి చూసేను.

"వుత్తినే ఇవ్వొద్దులెండి. నన్ను ప్రోస్టిట్యూట్ గా ఉపయోగించుకుని ఇవ్వొచ్చు కదా" ఆ మాటలు వినలేదు నేను. కాని కొంచెం దూరంలో మసక వెల్తురులో నులక మంచమ్మీద నానాయాతనలు పడుతున్న వ్యక్తిని చూసి ముందుకి కదిలేను. నా వెనకా ఆ అమ్మాయికూడా వచ్చింది.

"అమ్మా ఈబాధ భరించలేనమ్మా..భరించలేను" ఆ గొంతు నేను విన్నదే. ఆ ముఖం నేను చూసిందే. నులక మంచమ్మీన నుమ్మలు చుట్టుకుపోతున్న ఆ ముసలమ్మదగ్గరికి గబుక్కున వెళ్ళి పట్టుకుని "ఎలావుంది మామ్మా" అని అడుగుతోంది ఆ అమ్మాయి.


అప్పుడు స్పష్టంగా వాళ్ళిద్దరివేపూ చూసేను. వెంటనే జేబులోంచి చేతికొచ్చిన డబ్బును తీసి "మీ మామ్మను డాక్టరు దగ్గరకు తీసికెళ్ళంగా"అన్నాను. నేనిచ్చిన డబ్బును అందుకుని వన్నేదో అడగబోయింది ఆ అమ్మాయి. అప్పటికి నేను ప్రభుత్వంవారి రోడ్డుమీద, చీకట్లో గబగబా నడుస్తున్నాను. ✱


# సంతానం

## లేనివారు సంతానం పొందుటకు–సంప్రదించండి

### ప్రముఖ సంతాన్ & ఫ్యామిలి కంట్రోలింగ్ స్పెషలిస్టు

## డాక్టరు శ్రీమతి అండ్ శ్రీ చాగంటి రంగయ్యచౌదరి



'ఒక కుటుంబమునకు ఒకే బిడ్డ' డాక్టరు చౌదరి నినాదమునకు చేయూతనిచ్చి మనదేశ క్షేమమును, మీ కుటుంబ క్షేమమును కోరి చిన్న కుటుంబముగా తయారవుటకు మరియు జీవితంలో అసలు సంతానం రాదని నిరాశ చెందియున్న అనేకులు డాక్టర్ చౌదరిగారి వైద్యనిపుణతతో దేవుని కృపతో సంతానవంతులైన అనేకమంది సాక్ష్యములు కలవు. మీకు సంతానము కల్గు నంతవరకు ఉచితంగా మందులు ఇవ్వబడును. తదుపరి మీరు చార్జి చెల్లించే ఈ గ్యారంటీవైద్యమును పొందండి. సంతానవంతులు అవండి. స్త్రీ పురుషులలో లోపించిన యవ్వనశక్తిని తిరిగి పొందుటకు మరియు ఏ కారణమువల్లనయినా అయిష్టం అగివున్న స్త్రీలకు డి అంచ్ సి ఆపరేషనతో నిమిత్తం లేకుండా సుఖవంతమైన గర్భస్రావము (ఎబార్షన్) కొరకు మరియు నిరోధ్ లూపు ఆపరేషన్‌కు భయపడు వారికి వాటితో నిమిత్తం లేకుండా ఒకే బిడ్డతో వుంటూ తిరిగి మీ కోరిక ప్రకారమే బిడ్డను పొందే ఈ చక్కని అవకాశము కొరకు సంప్రదించండి.

కన్సల్టేషన్ ఫీజు: రు. 25 ప్రతిరోజు ఉదయం 8 గంటల నుండిరాత్రి 8 గంటల వరకు

**జీసస్ నర్సింగ్ హోమ్,** ఫోన్ నెం. 1. పోస్టాఫీసు ఎదురుగా, హనుమాన్ జంక్షన్, ప॥ గో॥ జిల్లా (A.P.)

(హనుమాన్ జంక్షన్ వచ్చుటకు విజయవాడ, ఏలూరు, గుడివాడ, నూజివీడుల నుంచి ప్రతి అర్ధగంటకు బస్సు వసతి కలదు.)

నోట్: ప్రతి శని, ఆదివారములు గుంటూరు పట్నములో హోటల్ బాలాజి లాడ్జి (జిన్నా టవరువద్ద)లో సంప్రదించవచ్చు.